క్లుప్తంగా

మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై రాజమండ్రికి చెందిన లలిత ఐశ్వర్యాంబిక నృత్యక్షేత్ర వారి నృత్యప్రదర్శన అలరించింది. గణేశ పంచరత్న కీర్తన, శివతాండవం, శివతరంగం, కామాక్షిస్తుతి, శివశంకరా, శివాష్టకం, జతిస్వరం, అయిగిరినందిని, శివశివశంకరా తదితర గీతాలకు ముత్యాల సునంద, అవంతిక, ధన్విత, లలితాసాత్విక, సత్యగీతిక, వెంకటరమ్య, యశస్వినీ సత్యపూర్ణిమ, లహరివెంకటసాయి మృదుల తదితరులు నృత్యాలను ప్రదర్శించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ బోధించేందుకు(గెస్ట్ ఫ్యాకల్టీ) ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వై.జిష్ణునాగ్‌విజయ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత ఉన్న వారు అర్హులన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం



మద్యం బాటిళ్లు, మోటార్ సైకిల్‌తో సీఐ

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని దేవస్థానం టోల్‌గేట్ వద్ద పోలీసులు తెలంగాణ మద్యం స్వాధీనం స్వాధీనం చేసుకున్నారు. సీఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాలు.. వన్‌టౌన్ పోలీసులు రఘునాథుడు బాలకష్ణ, మహేష్, శంకర్, అమర్నాథరెడ్డి టోల్ గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆకుల అలియాస్ సన్నీ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై 70 తెలంగాణ మద్యం బాటిళ్లు తరలిస్తూ పట్టుబడ్డాడు. మద్యం, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వేప చెట్టుకు పూజలు



వేప చెట్టు వద్ద గుమిగూడిన గ్రామస్తులు

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం గ్రామంలో వేప చెట్టుకు ప్రజలు పూజలు చేస్తున్నారు. చెట్టుకు పాల వంటి ధార రావడంతో స్థానికులు గమనించారు. చెట్టుకు మహిమలు ఉండటంతోనే పాలు కారుతున్నాయని ఆనోటా ఈనోటా ఇతర సమీప గ్రామాలకు సైతం తెలియడంతో పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని పూజలు నిర్వహించుకుంటున్నారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రమైన భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవను నిర్వహించారు. ముందుగా స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. వెయ్యి దీపాలను వెలిగించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

మహానందీశ్వరుడి దంపతులకు పల్లకీసేవ



మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర దంపతులకు సోమవారం రాత్రి ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించుకోండి

కొత్తపల్లి: గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పెద్దన్న సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి సమస్యలున్నా అధికారులకు తెలియజేయాలన్నారు. వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. ముగ్గులు రైతులు భూముల కొలతలకు దరఖాస్తు చేసుకున్నారని, వీలైనంత త్వరలో కొలతలు వేస్తామని హామీ ఇచ్చారు.

చెక్కు అందజేత

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామానికి చెందిన కురువ చెన్న అశోక్(22) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతనికి ప్రమాదబీమా కింద మంజూరైన రూ.10 లక్షల చెక్కును సోమవారం నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు మాండ్ర శివానందరెడ్డి, సర్పంచ్ ప్రకాశం మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

మల్లన్న క్షేత్రం.. చారిత్రక వైభవం

- ప్రధాన ఆలయంలో ఉపాలయాలుగా నవబ్రహ్మ ఆలయాలు
- పరమేశ్వరుని అష్టమూర్తులు, మోక్షలింగేశ్వరస్వామికి నిలయమైన తొమ్మిది ఆలయాల సమూహం
- మల్లన్న దర్శనం అనంతరం ఉపాలయాలను సందర్శిస్తున్న భక్తులు



శ్రీశైల ఆలయం



శ్రీశైల ఆలయంలో నవబ్రహ్మ ఆలయాలు

శ్రీశైలంటెంపుల్: పురాణాలు, ఇతిహాసాలు, సంస్కృత, తెలుగు, తమిళ, కన్నడ, మరాఠీ గ్రంథాలు ఎంతగానో కొనియాడిన శ్రీశైల మహాక్షేత్రం పౌరాణిక ప్రాశస్త్యంతో పాటు మరెంతో చారిత్రక వైభవాన్ని కలిగి ఉంది. శతాబ్దాల చరిత్రను సొంతం చేసుకున్న శ్రీశైలక్షేత్రం తరతరాల మన చారిత్రక వైభవానికి కారణంగా నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ తొలిపాలకులైన శాతవాహనులు మొదలు ఇక్ష్వాకులు, విష్ణుకుండీనులు, పల్లవులు, కదంబులు, చోళులు, రాష్ట్రకుటులు, చాళుక్యులు, హోయసులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర రాజులు, ఛత్రపతి శివాజీ మొదలైన వారందరి పాలనలో శ్రీశైలక్షేత్రం అంచలంచెలుగా అభివృద్ధి చెందింది. అందుకే శ్రీశైల ఆలయంలో స్వామిఅమ్మవార్ల ప్రధాన ఆలయాలతో పాటు ఎన్నో ఉప ఆలయాలు కూడా దర్శనమిస్తాయి. ఆలయవాస్తు, శిల్పపరంగా ఎన్నో ప్రత్యేకతలు కలిగిఉన్న ఈ ఆలయాలు పలు చారిత్రక సత్యాలకు సజీవసాక్ష్యంగా నిలిచాయి. ఈ ఉపాలయాలలో నవబ్రహ్మ ఆలయాలకు ఎంతో ప్రత్యేకత ఉంది.

ఆలయాలు సమూహంగా..

శ్రీశైల ప్రధాన ఆలయానికి పడమటి వైపున వాయువ్యదిశలో నవబ్రహ్మ ఆలయాలుగా పిలవబడే తొమ్మిది శివాలయాలు ఉన్నాయి. వీటి పక్కనే కుమారస్వామి ఆలయం ఉంది. వరుసగా ఉండే ఈ పది ఆలయాలకు కలిపి ఒకే మండపం నిర్మించబడి ఉంది. ఈ ఆలయాలన్నీ ఒకే నిర్మాణశైలిని కలిగిఉన్నాయి. వీటి గర్భాలయ ద్వారబంధాలు ఎలాంటి అలంకరణలు లేకుండా, సాధారణ శైలిలో నిర్మితమైన వీటి ప్రాచీనతను సూచిస్తున్నాయి. ప్రతి ఆలయానికి ఎదురుగా ఆలయ మండపంలో వరుసగా నందులు నెలకొల్పబడ్డాయి.

శివుని అష్టమూర్తులకు నిలయం

నవబ్రహ్మ ఆలయాల్లో శివుని అష్టమూర్తులైన శర్వమూర్తి, భవమూర్తి, రుద్రమూర్తి, ఉగ్రమూర్తి, భీమమూర్తి, ఈశానమూర్తి, మహాదేవమూర్తి, యజమానమూర్తి, లింగస్వరూపములో దర్శనమిస్తారు. ఈ శివలింగాలన్నీ వరుసగా క్షితిలింగం, జలలింగం ,అగ్నిలింగం, వాయులింగం, ఆకాశలింగం, సూర్యలింగం, చంద్రలింగం, యజమానలింగంగా పిలువబడుతున్నాయి. వీటికి చివరిగాగల ఆలయంలో మోక్షలింగేశ్వరస్వామి దర్శనమిస్తారు. ఈ తోమ్మిది ఆలయాలను నవబ్రహ్మ ఆలయాలుగా పిలిచేందుకు గల కారణాన్ని వివరించేందుకు తగిన ఆధారాలు లభించలేదు. అయితే తోమ్మిది శివలింగాలను బహుశా నవబ్రహ్మలు ప్రతిష్టించి ఉంటారని అర్చకులు చెబుతున్నారు. భృగువు, పులస్త్యుడు, పులహుడు, అంగిరుడు, అత్రి, క్రతువు, దక్షుడు, వసిష్ఠుడు, మరీచీ, మహర్షులకే నవబ్రహ్మలని పేరు.

చారిత్రకంగా..

నవబ్రహ్మ ఆలయ విమాన గోపురాలన్నీ మెట్లను కలిగి ఉండి, నాగరశైలిలో నిర్మితమై ఉన్నాయి. నిర్మాణపరంగా ఈ ఆలయాలు చాలావరకు చాళుక్యులు నిర్మాణశైలితో పోలిఉన్నాయి. శివాలయాలను సముదాయంగా నిర్మించే పద్ధతి చాళుక్యుల కాలంలో విలసిల్లింది. చాళుక్యులు ఆలంపురంలో నవబ్రహ్మ ఆలయాల పేర తొమ్మిది శివాలయాలను నిర్మించారు. అలాగే నంద్యాల జిల్లా ఆత్మకూరు దగ్గరలో నల్లమల అటవీప్రాంతాన గల సరస్వతీ క్షేత్రమైన కొలనుభారతీలోనూ సప్త శివాలయాల పేర ఏడు శివాలయాలు చాళుక్యుల చేత నిర్మించబడ్డాయి. ఇదేవిధంగా శ్రీశైల ఆలయంలోనూ చాళుక్యులు ఈ తోమ్మిది శివాలయాలను నిర్మించి ఉంటారని చరిత్రకారులు చెబుతున్నారు.

శ్రీశైలంలో ఆక్రమణల తొలగింపు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని లలితా బజార్‌లో అధికారులు సోమవారం ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. లలిత బజార్ కాంప్లెక్స్‌కు రెండు వైపులా ఉన్న షాపులకు మధ్యన కేవలం పది అడుగుల దూరం మాత్రమే ఉంది. దీంతో దుకాణదారులు దేవస్థానం నిర్మించిన లలితా బజార్ షాపులు చిన్నవిగా ఉండటంతో వ్యాపారులు ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నారు. ఇరుకైన సందుల్లో దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం గ్రహించిన దేవస్థానం అధికారులు.. ఈఓ పెద్దిరాజు దృష్టికి తీసుకురావడం ఆయన ఆదేశాల మేరకు ఈఈ రామకృష్ణ, రెవెన్యూ ఏఈఓ ఫణిధర్ ప్రసాద్ ఇంజినీరింగ్, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఫుట్‌పాత్‌పై ఉన్న ఆక్రమణలను జేసీబీతో తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి

పగిద్యాల: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ అదనపు గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల విద్యాధికారి సుభాన్ సూచించారు. సోమవారం ఆయన కేజీబీవీలో జరుగుతున్న అదనపు గదుల నిర్మాణాలను ఇంజినీర్ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫస్ట్ ఫ్లోర్ ఆర్సీ పనులను రెండు రోజుల్లో పూర్తి చేయించాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి ఉషకు సూచించారు. విద్యార్థినులకు పోషక విలువతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. పాఠశాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్‌లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన చేయాలని సూచించారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆమని ఉన్నారు.

అట్టహాసంగా 'శిక్షా సప్తాహ్'

- విద్యార్థులకు రుచికరమైన భోజనాల ఏర్పాటు



పారుమంచాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దాత కరుణాకర్‌రెడ్డి

జూపాడుబంగ్లా: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం శుభ్ దిన్ భోజన్ కార్యక్రమాన్ని పాఠశాలల్లో అట్టహాసంగా నిర్వహించారు. పోతులపాడు సర్పంచ్ పల్లె నిర్మలమ్మ, పారుమంచాలలో కరుణాకర్‌రెడ్డి విద్యార్థులకు పండ్లు, పరమాన్నాలతో నాణ్యమైన భోజనం వండిపెట్టారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు పండ్లు, పాయసం, పప్పు, సాంబారు, మజ్జిగతో రుచికరమైన భోజనాన్ని వండిపెట్టిన దాతలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. 29ఎన్‌డీకే61ఏ: మిడుతూరులో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న హెచ్‌ఎం సాయితిమ్మయ్య, ల్యాబ్ అసిస్టెంట్ రవీంద్రనాథరెడ్డి

మిడుతూరు: స్థానిక జెడ్పీ, ఎంపీపీ (బైరాపురం), చౌట్కూరు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు శుభదిన్ కార్యక్రమంలో భాగంగా రుచికరమైన భోజనం ఏర్పాటు చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో ల్యాబ్ అసిస్టెంట్ రవీంద్రనాథరెడ్డి తన మనవళ్ల పుట్టిన రోజును పురస్కరించుకొని మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం సాయి తిమ్మయ్య తెలిపారు. కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటినట్లు హెచ్‌ఎం శ్రీధర్‌కిశోర్ తెలిపారు.

పాములపాడు: వేంపెంట పాఠశాలలో సర్పంచ్ మాణిక్యమ్మ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం కృష్ణమూర్తి, రిటైర్డ్ టీచర్ దానమయ్య, ఉపాధ్యాయులు నాగరాజు, షరీఫ్, శివనాగిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నీలకంఠేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పగిద్యాల: మండలంలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో సోమవారం మొక్కుబడిగా సాగింది. దాతలెవరూ ముందుకు రాకపోవడంతో ఉపాధ్యాయులే తలా కొంచం నగదు వేసుకుని కార్యక్రమాన్ని మమ అని పించారు.

భ్రూణ హత్యలను నివారిద్దాం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఆత్మకూరు: భ్రూణ హత్యల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ కాంతారావు సూచించారు. సోమవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌమార దశలోని బాలికలకు శరీరంలో జరిగే మార్పుల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.బాబురాజేంద్రప్రసాద్, మేరిభా స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం మేనేజర్ పి.జుల్ఫీకర్ అలీఖాన్, హెల్త్ ఎడ్యుకేటర్ మద్దిలేటి పాల్గొన్నారు.

రేపు పట్టుబడిన వాహనాలకు వేలం పాటలు

ఆత్మకూరు: స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈనెల 31 వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ బి.మారుతీరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు, రూ.1,000 డిపాజిట్ చేసి పాల్గొనాలన్నారు.

ఆగస్టు 1న నందికొట్కూరులో..

నందికొట్కూరు: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఆగస్టు 1న స్థానిక సెబ్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ సీతారామిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రూ.3 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటల్లో పాల్గొనాలన్నారు.

తిథి భోజనం ఏర్పాటు

ఆత్మకూరు: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రహమత్‌నగర్ ఎంపీపీ పాఠశాలలో సోమవారం 'తిథి భోజనం' నిర్వహించారు. ఎంఈఓలు బాలాజీనాయక్, సురేష్‌కుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు వెజిటేబుల్ బిర్యానీ, కర్డ్ రైస్, ఎగ్, స్వీట్స్, అరటిపండు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సయ్యద్‌చాంద్ బాషా, ఉపాధ్యాయులు ముబినాపర్వీన్, రుస్మిన్, వాహబ్ పాల్గొన్నారు.

ఆలయ మండప నిర్మాణ పనులు ప్రారంభం



మండప నిర్మాణ పనులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండల పరిధిలోని ఉప్పలదడియ గ్రామంలో వీరభద్రస్వామి ఆలయ మండప నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. శిల్పి యాగంటి పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. అనంతరం మండప నిర్మాణానికి రూ.30లక్షలు విరాళమిచ్చిన బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని ఘనంగా సన్మానించనట్లు గ్రామ పెద్దలు కమతం జయరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామసుబ్బారెడ్డి, మహేశ్వరరెడ్డి, కమతం రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు స్వాములు, మాలమహానాడు నాయకుడు అబ్రహం కోరారు. ఈ విషయమై సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యలు–పరిష్కారవేదిక కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

పెద్దపులి దాడిలో బర్రె మృతి

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని ఇందిరేశ్వరం గ్రామం పద్మరాజ చెరువు శిఖం పొలాల్లో ఆదివారం పెద్దపులి దాడిలో పాడి బర్రె మృతి చెందింది. శ్రీపతిరావుపేట గ్రామానికి చెందిన మురహరిరాజేంద్ర పాడి బర్రె గ్రామ పశువుల మందతో పాటు అడవికి మేతకు వెళ్లింది. సాయంత్రం మందతో పాటు రావాల్సిన బర్రె రాకపోవడంతో యజమాని సోమవారం గాలింపు చేపట్టాడు. పద్మరాజచెరువు శిఖం భూముల్లో కళేబరం కనిపించింది. బర్రె గొంతుపై ఉన్న కాట్లు, సమీపంలో ఉన్న పాదముద్రలను బట్టి బర్రెను పులి చంపిందన్న నిర్ధారించుకున్నారు. నాగలూటి రేంజ్ అటవీ అధికారులు ఘటనాస్థలానికి వెళ్లి బర్రె విలువ రూ.70,000 ఉంటుందని అంచనా వేశారు.

లారీని ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

- 9 మందికి గాయాలు

పెనుకొండ: పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై 'వై' జంక్షన్ వద్ద ఆదివారం అర్ధరాత్రి లారీని ఆర్టీసీ బస్సు ఢీ కొన్న సంఘటనలో 9 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాలు ఇలా... కర్నూలు జిల్లా ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసి బస్సు 16 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి శ్రీశైలానికి బయలుదేరింది. ఆదివారం అర్ధరాత్రి పెనుకొండ 'వై' జంక్షన్ వద్దకు చేరుకుంది. ఆ సమయంలో రోడ్డు దాటుతున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డారు. బస్సులో ప్రయాణిస్తున్న ముస్తాక్, కర్నూలుకు చెందిన గురుప్రసాద్, సావిత్రి, స్వాతి, లారీ డ్రైవర్ నల్లప్ప మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ముందుభాగం బాగా దెబ్బతినగా డ్రైవర్ వెంకటేశ్వర్లు వాహనంలోనే ఇరుక్కుపోయాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు అతికష్టమ్మీద అతన్ని బయటకు తీశారు. క్షతగాత్రులందరినీ పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


కలెక్టర్‌కు వినతి

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకం మోటార్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలని నంద్యాలలో సోమవారం కలెక్టర్‌ను కలిసి విన్నవించినట్లు ఆయకట్టు రైతులు సోమవారం తెలిపారు. రూ.50 లక్షల నిధులు మంజూరు చేసి జూపాడుబంగ్లా 1, 2 ఎత్తిపోతల పథకం కింద ఉన్న ఐదు మోటార్లను బాగు చేయించాలని కోరగా కలెక్టర్ స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారని రైతులు తెలిపారు.

ఎన్‌ఎస్‌టీఆర్ గర్వకారణం

మహానంది: అతి పెద్ద టైగర్ రిజర్వ్ ఎన్‌ఎస్‌టీఆర్ మన తెలుగు రాష్ట్రంలో ఉండటం గర్వకారణమని హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ రీసర్చ్ ఆఫీసర్, ఫీల్డ్ కోఆర్డినేటర్ దూపాడు శ్రీధర్, ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా తిమ్మాపురం మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లమలలో పులుల సంతతి పెరిగిందన్నారు. పెద్దపులులతో పాటు చిరుతలు గణనీయంగా ఉన్నాయన్నారు. జీవవైవిద్యం పరిరక్షణలో పులుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌ఓలు జాకీర్‌హుసేన్, ప్రతాప్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. బండిఆత్మకూరు మండలంలోని పార్నపల్లె వద్ద ఎఫ్‌ఆర్‌ఓ నాసిర్‌జా ఆధ్వర్యంలో పులుల సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేంద్రనాయక్, ఎఫ్‌ఎస్‌ఓ తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె



దెంతే విరిగి కూలిన మట్టి మిద్దె పైకప్పు

పగిద్యాల: పడమర వనుములపాడు గ్రామంలోని ఓ మట్టి మిద్దె సోమవారం కూలిపోయింది. గ్రామానికి చెందిన సగినేల జయమ్మ, సగినేల సువార్తి దంపతుల 30 ఏళ్ల క్రితం నిర్మించుకున్న మట్టి మిద్దె ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి తెల్లవారుజామున కూలిపోయింది. బాధితులు ఇంటి నుంచి బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. వంట పాత్రలు, బియ్యం, తదితర సామగ్రి ధ్వంసమైనట్లు బాధితులు పేర్కొన్నారు.

క్యాన్సర్ వ్యాధి కారక మందు కొనుగోలు చేయొద్దు

మహానంది: క్యాన్సర్ వ్యాధికి కారణమయ్యే నిషేధిత గ్లైఫోసేట్ మందును కొనుగోలు చేయవద్దని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. బుక్కాపురం గ్రామంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. నిషేధిత గడ్డిమందులు విక్రయించొద్దని, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు ఇవ్వాలని దుకాణాదారులకు ఆయన సూచించారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నందికొట్కూరు: ఇంటర్ కాలేజీలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ ఆది డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, పాఠ్యపుస్తకాలు అందించాలని, ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టాలని, సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు జగదీష్, గణేష్, మహబూబ్, సురేంద్ర, మాబాషా, పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలి



లబ్ధిదారులతో కలసి సమస్యలపై మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: స్థానిక జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం లబ్ధిదారులతో కలిసి జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ శివారులోని 2, 3 జగనన్న లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు రోడ్లు, నీరు, విద్యుత్, రవాణా తదితర సమస్యలు వేధిస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పకీరి సాహెబ్, గోపాల కృష్ణ, బాబు, షబ్బీర్, గోకారి, గోపాల్, శాలుబాషా, సుభాన్, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, మాబాషా, అజీమ్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



పత్తి పైరును పరిశీలిస్తున్న ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు

మిడుతూరు: సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ నీలిమ, డాక్టర్ రవి ప్రకాశ్ రెడ్డి, డాక్టర్ పులిబాయి, డాక్టర్ శివరామకృష్ణ అన్నారు. మిడుతూరు సమీపంలో పత్తి, మొక్కజొన్న, కంది, టమాటా, మిరప పైర్లను పరిశీలించారు. పర్యావరణ సమతుల్యం దెబ్బతినకుండా, రసాయన మందుల వాడకం తగ్గించుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిచాలని రైతులకు సూచించారు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వారి వెంట నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్, ఏఓ పీరు నాయక్, అగ్రికల్చర్ అసిస్టెంట్ అశోక్ ఉన్నారు.

హాస్టల్ నిర్మించాలని వినతి

ఆత్మకూరు: మండలంలోని కొట్టాల చెరువు తండాలో గిరిజన బాలుర వసతిగృహాన్ని నిర్మించాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు శివనాయక్, వెంకటేశ్వర్లు, భాస్కర్ సోమవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే.. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఇద్దరి అరెస్ట్

మహానంది: బొల్లవరం మెట్ట వద్ద సోమవారం బనగానపల్లెకు చెందిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. బైకుపై నాటుసారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడంతో పాటు కోర్టులో హాజరు పరచామని చెప్పారు.

మన దేశంలోనే పులులు అధికం



మాట్లాడుతున్న రేంజర్ పట్టాభి

ఆత్మకూరు రూరల్: ప్రపంచంలోని పులుల సంఖ్యలో 90 శాతం మనదేశంలోనే ఉన్నాయని ఆత్మకూరు అటవీ రేంజ్ అధికారి పట్టాభి తెలిపారు. డివిజన్‌లోని బైర్లూటి రేంజ్ లో ఉన్న ఎకో – టూరిజం ఆవరణలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ పెద్దపులుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 నాటికి దేశంలో 53 పులుల సంరక్షిత అభయారణ్యాలలో 3,682 పులులు ఉన్నాయన్నారు. ఈ యేడాది మరో రెండు పెద్ద పులుల అభయారణ్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పులి సంరక్షణలో భాగంగా పులి ఆవరణం , పులి ఆహారం సంరక్షించబడతాయన్నారు. అనంతరం అంతర్జాతీయ పెద్దపులుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓలు దొరస్వామి, సుభాష్, ఖాన్, వన్యప్రాణి వైద్యులు జుబేర్, వెస్లీ తదితరులు పాల్గొన్నారు.